# ముందుమాట

గత 53 సంవత్సరాలుగా తెలంగాణకోసం మనం చేస్తున్న పోరాటం అంతిమ దశకు చేరుకున్నదని తెలియచేయుటకు సంతోషిస్తున్నాము. ఎందరో వ్యక్తుల బలిదానం, ఎన్నో ఉద్యమాలు ఇప్పటి వరకు ఉవ్వెత్తున లేసినప్పటికి కుట్రలతో, కుతంత్రాలతో వీటిని నిర్వీర్యం చేసినారు. ప్రజల గుండెల్లోంచి వచ్చే ఈ ఆవేశాన్ని ఆక్రోశాన్ని ఎన్ని తరాలు ఈ కుటిల ప్రభుత్వాలు ఆపగల్గుతాయి. తెలంగాణ దశ-దిశలను మనమే నిర్ధారించుకునే సమయం ఆసన్నమైంది.

డిసెంబర్ 9-2009, నాడు దేశ హోంశాఖామాత్యులు మన తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైనది చెప్పినారు. సుమారు రెండు వారాలు తిరగక ముందే ఆంధ్ర నాయకుల ఒత్తిడికి తల ఒగ్గి మాటను వెనక్కి తీసుకొని, తెలంగాణ ప్రజల సంతోషాన్ని హరించి వేసాడు.

**"ఇప్పుడు మనకు తెలంగాణ రాకుంటే మరెప్పటికీ రాదు"**

**(Telangana Now or Never!!!)**

ఈ పుస్తక ప్రచురణకు సహకరించిన **డా॥ శ్రీనివాస్ రాజ్ బైరి, కె. దిలీప్** మరియు **కె. ప్రతాప్‌రెడ్డి** గార్లకు కృతజ్ఞతలు.

T.D.F. - U.S.A. అధ్యక్షులు శ్రీ **పి. విప్లవ్‌రెడ్డి** గారికి మా యొక్క ప్రత్యేక ధన్యవాదములు.

దోమ పాండురంగారెడ్డి (డి.పి.రెడ్డి)

**తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం - ఇండియా** (T.D.F. - India)

ప్రవాసి తెలంగాణ వేదిక

www.telangana.org

# తెలంగాణం

తెలంగాణ ప్రాంతం 1956 వరకు హైదరాబాద్ రాష్ట్రంగా ఉంది. అంతకు ముందు ఈ ప్రాంతాన్ని ఏడో ఆసఫ్ జాహీ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ పాలించాడు. అతను ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా గుర్తింపు పొందాడు. 1937 ఫిబ్రవరి 22వ తేదీ సంచికలో టైమ్ పత్రిక (www.time.com) కవర్ పేజీ మీద నిజాం ఫోటోను ప్రచురించారు.

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో ఉన్న దాదాపు 600 స్వతంత్ర రాజ్యాల్లో హైదరాబాద్ రాజ్యం అతి పెద్దది. ఇది దాదాపు యునైటెడ్ కింగ్ డమ్ అంత పెద్దది. ఏడో నిజాం బ్రిటిష్ పాలనలో అత్యున్నత స్థాయి రాజుగా గుర్తింపు పొందాడు. అతను 21-గన్ సాల్యూట్‌ను అందకునేవారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అందించిన ఆర్థిక సాయానికిగాను అతను బ్రిటిష్ సామ్రాజ్యానికి విశ్వాసపాత్రుడైన మిత్రుడిగా స్థానం సంపాదించుకున్నాడు.

అదే సమయంలో ప్రజా పరిపాలకుడిగా కూడా అతను పేరు సంపాదించుకున్నారు. విద్య, శాస్త్రం, అభివృద్ధి, సాహిత్యం, కళలు, ఆర్కిటెక్చర్, సంస్కృతి, ఆభరణాల సేకరణ, వంటివాటిలో కృషికి ఏడో నిజాం పేరెన్నికగన్నాడు. తన 37 ఏళ్ల పాలనలో నిజాం విద్యుత్తు సరఫరాకు శ్రీకారం చుట్టాడు. రైల్వేలు, రోడ్లు, ఎయిర్‌వేస్‌ను అభివృద్ధి చేశాడు. హైదరాబాద్ లోనూ దాని పరిసరాల్లోనూ పలు సరస్సులు తవ్వించాడు. తుంగభద్ర నదిపై నీటి పారుదల ప్రాజెక్టులను కూడా చేపట్టాడు. నిజాం నిర్మించిన భవనాల్లోనే ఇప్పటికీ పలు ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తున్నాయి. ఇప్పటి స్టేట్ సెంట్రల్ లైబ్రరీ అప్పటి ఆసఫియా లైబ్రరి. అప్పటి టౌన్‌హాల్ ఇప్పటి అసెంబ్లీహాల్, జూబిలీ హాల్, అప్పటి హైదరాబాద్ మ్యూజియం ఇప్పటి నిజామియా అబ్జర్వేటరీ అలా పలు భవనాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ప్రభుత్వ కార్యాలయాలుగా ఉపయోగ పడుతున్నాయి.

నిజాం హైదరాబాద్ స్టేట్ బ్యాంక్‌ను స్థాపించాడు. అదే ఇప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్. హైదరాబాద్

రాజ్యంలో ఉస్మానియా సిక్కాలు (కరెన్సీ) చెలామణిలో ఉండేది. అప్పట్లో బ్రిటిష్ ఇండియాలో సొంత కరెన్సీ ఉన్న రాజ్యం హైదరాబాద్ ఒక్కటే. దాన్ని హైదరాబాద్ రూపీగా పిలిచేవారు. అది భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు భిన్నమైంది. సొంత కరెన్సీని చెలామణిలో పెట్టుకోవడానికి బ్రిటిష్ పాలకుల అనుమతి ఉన్న రాజ్యం కూడా హైదరాబాద్ ఒక్కటే. వంద రూపాయల నోటును 1918లోనే ప్రవేశపెట్టారు.

తెలంగాణలోని చేతివృత్తులవారిని నిజాం ఇతోధికంగా ప్రోత్సహించాడు. తెలంగాణ చేనేత కార్మికుడు అగ్గిపెట్టెలో పట్టేంత చీరను నేసి ప్రపంచంలోనే రికార్డు సృషించాడు. అది ఆరు మీటర్లు ఉండి ఒక స్త్రీ ధరించడానికి చక్కగా వుండేది.

1947కు ముందు హైదరాబాద్ భారతదేశంలో ఐదో అతి పెద్దనగరం. అద్భుతమైన పరిపాలనా భవనాలు, రోడ్లు, రైల్వే వ్యవస్థ, విమానాశ్రయాలు, పోలీసు, సైనిక వ్యవస్థలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కూడా హైదరాబాద్ రాష్ట్రంలోనే అభివృద్ధి చెందాయి. అనుబంధం 1లో నైజాం కాలంలో జరిగిన అభివృద్ధిని చూడవచ్చు.

అప్పట్లో డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్, హైదరాబాద్‌ను భారతదేశానికి రెండవ రాజధానిగా చేయాలని చెప్పేవారు.

## భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. కానీ హైదరాబాద్‌లో నిజాం పాలనే

1947లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది. మత ప్రాతిపదికపై దేశం విభజనకు గురైంది. భారత ఉపఖండం నుంచి బ్రిటిష్ పాలకులు 1947లో ఖాళీ చేసిన తర్వాత కూడా నిజాం పాలనలో 16 మిలియన్ల మంది ప్రజలు ఉన్నారు. బ్రిటిష్ కామన్‌వెల్త్ దేశాల్లో ప్రత్యేక దేశంగా కొనసాగే ఉద్దేశంతో నిజాం భారత్‌లో గానీ పాకిస్తాన్‌లో గానీ కలవడానికి ఇష్టపడలేదు. అయితే ఆ ప్రతిపాదనను బ్రిటిష్ పాలకులు తిరస్కరించారు. భారత్‌తో అవగాహనకు రావడానికి తిరస్కరించేందుకు నిజాం రజాకార్లను చూపిస్తూ వచ్చాడు.

నిజాంపై వేలాది మంది రైతులు తిరుగుబాటు చేశారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో సిపిఐ చేతులు కలిపింది. నాలుగు వేల మంది ఈ పోరాటంలో

ప్రాణాలు అర్పించారు. ఎట్టకేలకు 1948 తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా స్థానిక భూస్వాముల భూములు చాలా వరకు పేదల చేతుల్లోకి వచ్చాయి. భారత చరిత్రలోనే ఇది మహా పోరాటంగా గుర్తింపు పొందింది. నిజాం సాయుధ పోరాటాన్ని అణిచివేయడానికి  శతవిధాలా ప్రయత్నించాడు.

జలియన్‌వాలాబాగ్‌ని తలపించే మారణకాండ తెలంగాణలోని బైరాన్‌పల్లి, కుటిగల్, అకునూరు, మాచిరెడ్డిపల్లి, రేణిగుంట, గుండ్రాంపల్లి, పెరుమళ్ళ గ్రామాల్లో సాగింది. రజాకార్లు వందలమందిని కర్కశంగా నిలబెట్టి కాల్చి చంపారు.

మహాత్మాగాంధీ ఇలా అన్నారు - హైదరాబాద్‌లో పరిస్థితి రోజు రోజుకూ విషమిస్తోంది. అక్కడి ప్రజలు తీవ్రబాధకు వేదనకు గురువుతున్నాయి. వారు ఎవరిపట్ల అకృత్యాలకు పాల్పడకపోయినప్పటికీ వారిపై అకృత్యాలు కొనసాగుతున్నాయి. వారిని తప్పకుండా విజయలక్ష్మి వరిస్తుంది. సత్యం కోసం వారు చూపుతున్న సాహసాన్ని, పోరాటాన్ని నేను ప్రశంసిస్తున్నాను.

జవహర్‌లాల్ నెహ్రూ ఇలా చెప్పారు. - హైదరాబాద్ ప్రజలు మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. ప్రజలపై జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా వారికి న్యాయం జరిగేందుకు అన్ని పార్టీలు కలిసి పోరాటం చేయాలి.

## హైదరాబాద్ విముక్తి తొలి ఎన్నికలు

హైదరాబాద్ రాజ్యంలోని మెజారిటీ ప్రజలు హిందువులు కావడం వల్ల హైదరాబాద్ రాజ్యం భారతదేశం మధ్యలో ఉండడం వల్ల భారత ప్రభుత్వం 1948లో హైదరాబాద్ స్వాధీనానికి పూనుకుంది.

సర్దార్‌వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో అపరేషన్ పోలో పేరుతో భారత ప్రభుత్వం సైనిక చర్యకు దిగింది. తద్వారా హైదరాబాద్ రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేసుకుంది. ఆ రకంగా హైదరాబాద్ రాజ్యం 1948 సెప్టెంబర్ 17వ తేదీన స్వాతంత్ర్యం పొందింది. 1948 - 1956 మధ్యకాలంలో హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగింది.

జనవరి 1950లో యం.కె. వెల్లోడి అనే ప్రభుత్వ ఉన్నతాధికారిని ఎటువంటి ఎన్నికలు లేకుండానే హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా భారత ప్రభుత్వం నియమించింది. దీని వలన ఎంతోమంది ఆంధ్రనుండి అధికారులు ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమించబడ్డారు.

హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు తొలిసారిగా 1952లో ఎన్నికలు జరిగాయి. బూర్గుల రామకృష్ణరావు తొలి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఈలోగా మద్రాసు ప్రెసిడెన్సీలో ఉన్న తెలుగు మాట్లాడే ఆంధ్ర ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేస్తున్నారు. ఆంధ్రప్రాంత ప్రజలు తమిళుల ఆధిక్యతను భరించలేక వారికొక సొంత రాష్ట్రం కావాలని ప్రయత్నంచేశారు.

## పొట్టి శ్రీరాములు ఆమరణ నిరహార దీక్ష

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం రాజధానిగా మద్రాసు నగరాన్ని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గాంధేయవాది పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 58

రోజుల సుదీర్ఘదీక్ష తర్వాత ఆయన 1952 డిసెంబర్ 15వ తేదీన అమరులయ్యారు. ఆయన అంతిమ యాత్ర సందర్భంగా మద్రాసు నగరం మరియు ఆంధ్ర రాష్ట్రాల్లో తీవ్ర హింస చెలరేగింది.

## ప్రత్యేక రాష్ట్ర ప్రకటన

మద్రాసును తమిళ రాష్ట్ర రాజధానిగానే పరిగణిస్తూ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం 1952 డిసెంబర్ 19వ తేదీన ప్రకటన చేసింది. జెవిపి (జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య) కమిటీ నివేదిక ప్రకారం 1950లోనే ఆంధ్రరాష్ట్రం ఏర్పడాల్సి వుండింది. అయితే మద్రాసును ఆంధ్రరాష్ట్ర రాజధానిగా ప్రకటించాలని ఆంధ్ర ప్రజలు ఆందోళనలకు దిగడంతో రాష్ట్ర ఏర్పాటులో జాప్యం జరిగింది.

ఆంధ్ర రాష్ట్రం కర్నూలు రాజధానిగా 1953 అక్టోబర్ 1వ తేదీన ఏర్పడింది. కనీస సౌకర్యాలతో పాటు కేంద్ర కార్యాలయానికి స్థలం కూడా లేకపోవడంతో పాలన సరిగా

సాగలేదు. శిబిరాల కింద నుంచి పాలన సాగించాల్సి వచ్చింది. పైగా 5 కోట్ల లోటు బడ్జెట్ కూడా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని నిస్సహాయ స్థితిలో ఉండేది.

## రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ (S.R.C)

భాషా ప్రాతిపదికపై ఆంధ్రరాష్ట్రం ఏర్పడడంతో అదే ప్రాతిపదికపై రాష్ట్రాల ఏర్పాటుకు దేశంలో ఆందోళనలు ముందుకు వచ్చాయి.

భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్విభజనపై సిఫార్సులు చేయడానికి కేంద్ర ప్రభుత్వం 1953లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి సయ్యద్ ఫజల్ అలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్విభజన కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ తన నివేదికను 1955లో సమర్పించింది.

తెలంగాణలోని తెలుగు మాట్లాడే ప్రజలున్న 8 తెలంగాణ జిల్లాలను హైదరాబాద్ రాష్ట్రంగా విడిగా ఉంచాలని, ఇష్టపడితే 1961లో (రెండు ఎన్నికల తర్వాత)

శాసనసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అంగీకారంతో సమైక్య తెలుగు రాష్ట్రంలో కలపాలని, ఈ రెండు ప్రాంతాలు కూడా అసమానంగా అభివృద్ధి చెందినందున అది అవసరమని ఎస్సార్సీ స్పష్టంగా చెప్పింది.

అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణ ప్రాంతాన్ని విలీనం చేయడానికి ఇష్టపడలేదు. విశాలాంధ్ర డిమాండ్‌ను ఆయన తప్పుపట్టారు. దాన్ని "విస్తరణ కాంక్షగా" అభివర్ణించారు. (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, అక్టోబర్ 17, 1953)

అప్పటికే హైదరబాద్‌లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నందున ఆంధ్ర నాయకులు తెలుగు సహోదరత్వాన్ని ప్రచారం చేశారు.

అప్పట్లో విశాలాంధ్ర ఏర్పడాలన్న కొంతమంది ఆంధ్రనాయకుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్ మనతో కలిస్తే మన సమస్యలన్నీ తీరిపోతాయి. కానీ అది ఎలా సాధ్యం, దాన్ని ఎలా సాధించ

గలమనే విషయంపై ఆలోచన చేయాలి – టంగుటూరి ప్రకాశం. 1953

రాజధానికి అవసరమైన సదుపాయాలున్న నగరమేదీ మనకులేదు – నీలం సంజీవరెడ్డి (ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి)

(కర్నూలును రాజధానిగా చేయాలని రాయలసీమ వారు డిమాండ్ చేశారు. లేకపోతే తాము (రాయలసీమ) ఆంధ్ర రాష్ట్రంలో చేరబోమని, మద్రాసు రాష్ట్రంలోనే కొనసాగుతామని హెచ్చరించారు.)

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నాయకుల మధ్య కుదిరిన శ్రీబాగ్ ఒడంబడిక మేరకు 1953లో కర్నూలు ఆంధ్రరాష్ట్ర రాజధాని అయింది. రాష్ట్ర రాజధానినే కాదు. జిల్లా కేంద్ర కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేసుకోవడానికి తగిన ప్రాంతంలేదు – కడప కోటిరెడ్డి, 1954)

వాణిజ్యంలో అభివృద్ధి చెందిన ప్రాంతం ఆంధ్రలో లేదు. విశాఖ ఉన్నప్పటికీ అది కూడా చాలా చిన్నది.

***– ఎ. గోపాలరావు, 1954***

ఆంధ్రలో బొగ్గు, ఆయిల్ వనరులు లేవు. విద్యుదుత్పత్తికి అవకాశాలు కూడాలేవు – బెజవాడ గోపాలరెడ్డి, 1953

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు

ప్రతిపాదిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై జవహర్‌లాల్ నెహ్రూ 1956 మార్చి 5వ తేదీన నిజామాబాద్‌లో మాట్లాడుతూ ఒక అమాయకమైన అమ్మాయిని (తెలంగాణను), తెలివైన తుంటరి అబ్బాయికి (ఆంధ్ర) పెళ్లి చేసినట్లుగా ఉంది. కలిసి ఉండాలా, విడిపోవాలా అనేది వారిష్టం అని అన్నాడు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా రెండు ప్రాంతాలను విలీనం చేస్తున్నట్లు ఆ ప్రకటన ద్వారా తొలిసారి తెలంగాణవారికి తెలిసింది. తెలంగాణ ప్రజలు వ్యతిరేకించినా కూడా హైదరాబాద్ (తెలంగాణ), ఆంధ్ర రాష్ట్రాలను విలీనం చేస్తూ 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

విలీనం సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ నాయకుల మధ్య "పెద్ద మనుషుల ఒప్పందం" (Gentlemen's Agreement) కుదిరింది. విద్య, ఉద్యోగాల్లో, తెలంగాణకు అన్యాయం జరగకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని, తెలంగాణలోని అదనపు రెవిన్యూను ఆ ప్రాంతంలోనే ఖర్చు చేస్తామని, తెలంగాణ ప్రాంతానికి కేటాయించే నిధుల లెక్కలు ప్రత్యేకంగా చూపుతామని, అందుకు ప్రాంతీయ బోర్డును ఏర్పాటు చేస్తామని ఆ ఒప్పందంలో చేర్చారు. ముఖ్యమంత్రి పదవిగానీ ఉప ముఖ్యమంత్రి పదవిగానీ తెలంగాణకు దక్కాలని, అలాగే హోం, రెవెన్యూ, ప్రణాళిక అభివృద్ధి శాఖల్లో కనీసం రెండు ప్రధాన మంత్రిత్వశాఖలను తెలంగాణవారికి ఇవ్వాలని కూడా ఒప్పందంలో చేర్చారు. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘన మొదలైంది. ఆరో వేలితో సమానమంటూ తెలంగాణకు ఉప ముఖ్యమంత్రి పదవిని నిరాకరించారు. హోం మంత్రిత్వశాఖ మినహా మిగతా ప్రధానమైన శాఖలను గత 53 ఏళ్ళలో ఎప్పుడో గాని ఇవ్వలేదు.

## 1969 జై తెలంగాణ ఉద్యమం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన 13 సంవత్సరాలలో ముల్కీ నిబంధనలను, పెద్ద మనుషుల ఒప్పందాన్ని యధేచ్ఛగా ఉల్లంఘించారు. దీంతో 1968 నాటికి 25 వేల మందికి పైగా తెలంగాణేతరులు స్థానిక తెలంగాణ ఉద్యోగాల్లో చేరిపోయారు. దాంతో విద్యార్థులు, ఉద్యోగుల్లో తమకు మోసం జరిగిందనే భావన పాదుకుంది. తమకు అర్హతలు, సామర్థ్యం, పోటీతత్వం. ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగాలు లభించడం లేదనే ఆవేదన గూడుకుట్టుకుంది. తెలంగాణేతర ప్రాంతాలకు చెందిన ఉన్నతాధికారుల బంధుప్రీతి వల్ల తెలంగాణేతర ప్రాంతాలవారే ఉద్యోగాలను కొల్లగొడుతూ వచ్చారు.

నిజాం కాలంనాటి ముల్కీ నిబంధనలను కాలరాస్తూ ఆంధ్ర ప్రాంతానికి చెందినవారు ప్రభుత్వోద్యోగాల్లో నిండి పోయారు. సీనియారిటీ ప్రాతిపదికపై తెలంగాణవారికి ఉద్యోగాల్లో ప్రమోషన్లు లభించలేదు. వాటిని తెలంగాణేతర ప్రాంత ఉద్యోగులతో నింపేస్తూ వచ్చారు. పన్నులు తదితర

రూపాల్లో తెలంగాణలో సమీకరించిన నిధులను ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు మళ్లించింది. తెలంగాణలోని బొగ్గు, నీరు వంటి సహజ వనరులను ఆంధ్రప్రాంత అభివృద్ధికి, పరిశ్రమలకు తరలించారు. దీంతో విద్యార్థుల ఉద్యమం ఎగసిపడింది. దాన్నే 1969 జై తెలంగాణ ఉద్యమంగా పిలుస్తారు.

ఆ ఉద్యమం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొదలైనప్పటికి అనతి కాలంలోనే తెలంగాణ పల్లెపల్లెలకు విస్తరించింది. విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా ప్రభుత్వో ద్యోగులు, ప్రతిపక్ష సభ్యులు ప్రత్యక్ష చర్యకు దిగుతామని హెచ్చరించారు. ఉద్యోగులు పెన్ డౌన్ వంటి సమ్మెలకు దిగారు. అన్ని వర్గాలవారు ఉద్యమంలోకి వచ్చారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి రాజకీయ నాయకులు తమ మంత్రి పదవులకు రాజీనామాలు చేసి ఉద్యమంలోకి దిగారు. మదన్ మోహన్, మల్లిఖార్జున్, పులి వీరన్న వంటి నాయకులు ఉద్యమంలోకి వచ్చారు.

తొమ్మిది నెలల ఉద్యమ కాలంలో పోలీసు కాల్పుల్లో 370 మందికిపైగా విద్యార్థులు మరణించారు. 70 వేల మందికి పైగా అరెస్టయ్యారు. వారిలో 7 వేల మంది మహిళలున్నారు. 3266 సార్లు ఆందోళనకారులపై పోలీసు లాఠీచార్జీలు జరిగాయి. ఈ లాఠీచార్జీల్లో 20 వేల మందికిపైగా గాయపడ్డారు. దాదాపు 1840 మంది బుల్లెట్లకు, టీయర్ గ్యాస్‌షెల్స్‌కు గాయపడ్డారు. ఇదంతా అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కనుసన్నల్లో జరిగింది.

ఉద్యమం తీవ్రతరం కావడంతో తెలంగాణ హక్కుల రక్షణకు అఖిలపక్ష ఒప్పందం కుదిరింది. అయితే ఆరు నెలలలోపే దానిని ప్రభుత్వం ఖాతరు చేయలేదు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎనిమిది సూత్రాలు, ఐదు సూత్రాల ఫార్ములాలను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఉద్యమాన్ని పాశవికంగా అణిచివేశారు. దీంతో 1971 సాధారణ ఎన్నికల్లో ప్రజలు తమ ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను బ్యాలెట్ రూపంలో తెలియజేశారు. తెలంగాణ ప్రాంతంలోని

14 లోకసభ సీట్లలో డా॥ మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా సమితి 11 సీట్లను గెలుచుకుంది.

ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ పార్టీలోని కొంతమంది నాయకులు 1971 సెప్టెంబర్‌లో ఉద్యమాన్ని వదిలేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. డా॥ మర్రి చెన్నారెడ్డి వంటి నాయకులు కూడా తెలంగాణ ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

1971 సెప్టెంబర్‌లో కాసు బ్రహ్మానందరెడ్డి స్థానంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన పివి నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టారు.

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ముల్కీ నిబంధనల కింద స్థానికులకు విద్య, ఉద్యోగాల్లో కల్పించిన ప్రత్యేక అవకాశాలను సమర్థిస్తూ 1972లో తీర్పు ఇచ్చింది. దాంతో జై ఆంధ్ర ఉద్యమం తలెత్తింది. ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు తన మంత్రివర్గాన్ని ప్రకటించిన రోజు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలన విధించింది. ఈ విధంగా తెలంగాణ

నుండి మొదటి సారిగా ముఖ్యమంత్రి అయిన పి.వి. నరసింహారావును కొద్దినెలల్లోనే ముఖ్యమంత్రి పదవికి దూరంచేశారు.

తెలంగాణకు జై ఆంధ్ర ఉద్యమం పెను ముప్పుగా పరిణమించింది. దాంతో ఈ కింద అంశాలపై చర్చలు జరిగాయి.

ఎ. ముల్కీ నిబంధనలు మార్చివేశారు.

బి. తెలంగాణ ప్రాంతీయ బోర్డు రద్దయింది.

సి. ఫ్రీజోన్‌గా ప్రకటించకుండానే ఆరో జోన్‌లోని హైదరాబాద్ అనధికారికంగా ఫ్రీజోన్ అయిపోయింది.

డి. స్థానికతకు 12 నుంచి 4 ఏళ్ళ నివాసం విధానంగా మారింది.

ఇ. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల రెవెన్యూను విడివిడిగా చూపడాన్ని ప్రభుత్వం ఆపేసింది.

ఎఫ్. తెలంగాణ రైతుల నుంచి యధేచ్ఛగా భూములను కొనుగోలు చేయడానికి స్వేచ్ఛ లభించింది.

దాంతో ఆరు సూత్రాల పథకాన్ని తుంగలో తొక్కారు. తద్వారా తెలంగాణ ప్రజలకు మరోసారి ద్రోహం తలపెట్టారు.

జలవనరులను, ఉద్యోగాలను, విద్యావకాశాలను కొల్లగొట్టే విషయంలో ఆంధ్రులు ఇక వెనక్కి తగ్గాల్సిన అవసరం లేకుండా పోయింది.

**తెలంగాణ ప్రాంతానికి జరిగిన అన్యాయాలను ఇప్పుడు చూద్దాం.**

తెలంగాణలో దేశంలోనే అతి పెద్ద బొగ్గు గనులు న్నాయి. సున్నంరాయి నిల్వలు, విశాలమైన అడవులు, థర్మల్ విద్యుదుత్పత్తి సౌకర్యాలున్నాయి. వివిద ఉపనదులున్న కృష్ణా, గోదావరి నదుల 70శాతం క్యాచ్ మెంట్ ఏరియా ఉంది.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ద్వారా తెలంగాణ ప్రజలు ప్రతీసారీ ఆత్మగౌరవ, స్వయంపాలన పోరాటంచేస్తూనే ఉన్నారు. తెలుగు భాష, తెలుగు సహోదరత్వం పేరు చెప్పి ఆంధ్రా నాయకులు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ఎప్పటికప్పుడు కాలరాస్తూనే ఉన్నారు. తెలంగాణవాదులను వేర్పాటువాదులుగా చిత్రీకరిస్తూ తెలంగాణ ప్రజల డిమాండ్‌ను దెబ్బ కొడుతూనే ఉన్నారు. మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడడానికి పోరాటం చేసిన ఆంధ్రప్రాంత నాయకులను వేర్పాటువాదులుగా కాకుండా

మహా నాయకులుగా ఎందుకు కీర్తిస్తున్నారనేది ప్రశ్న. గత 53 ఏళ్లలో అన్ని నిబంధనలను ఒప్పందాలను, ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించారు. వనరులను ఉద్యోగాలను, నిధులను ఆంధ్ర ప్రాంతాభివృద్ధికి మళ్లిస్తూనే ఉన్నారు.

## వివిధ రంగాల్లో జరిగిన అన్యాయాలు

తెలంగాణ జిల్లాలో ప్రజలు పలు సమస్యలను ఎదుర్కుంటున్నారు. నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ సమస్య. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు, గిరిజన ప్రాంతాల్లో వైరల్ జ్వరాల వంటి వాటితో ఇబ్బందుల పాలవుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో లక్షల మంది వలసలు వెళ్ళుచున్నారు.

దాదాపుగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో జనాభా సరిసమానంగా ఉన్నప్పటికీ, విద్యా సౌకర్యాల్లో వ్యత్యాసాన్ని, ఉపాధ్యాయుల్లో తేడాను ప్రభుత్వ ఎయిడ్‌ను మనం గమనించవచ్చు.

## విద్య

**TABLE - 1**

| వివరాలు | ఆంధ్ర (9 జిల్లాలు) | రాయలసీమ (4 జిల్లాలు) | తెలంగాణ (10 జిల్లాలు) |
|---|---|---|---|
| విస్తీర్ణం | 33.75 % | 24.57 % | 41.47 % |
| జనాభా | 41.46 % | 17.77 % | 40.54 % |
| అక్షరాస్యతా రేటు | 42 % | 38 % | 30 % |
| మొత్తం పాఠశాలు | 26,800 | 13,001 | 17594 |
| విద్యార్థుల సంఖ్య | 27,57,269 | 13,02,673 | 20,00,452 |
| ఉపాధ్యాయుల సంఖ్య | 64,314 | 28,434 | 40,798 |
| జూనియర్ కళాశాలలు | 270 | 140 | 176 |
| డిగ్రీ కళాశాలలు | 170 | 70 | 74 |
| లైబ్రరీలు | 630 | 243 | 450 |

## TABLE -2

| వివరాలు | ఆంధ్ర (9 జిల్లాలు) | రాయలసీమ (4 జిల్లాలు) | తెలంగాణ (10 జిల్లాలు) |
|---|---|---|---|
| ఉపాధ్యాయులు | 10042 | 4663 | 8732 |
| **ప్రైవేట్ కళాశాలలకు గ్రాంట్ ఇన్ ఎయిడ్** (పోస్టుల సంఖ్య) | 96 (535) | 32 (511) | 31 (204) |
| వైద్య కళాశాలలు | 4 | 4 | 3 |
| ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలకు గ్రాంట్లు | 58.87% | 17.06 % | 24.07% |
| **విద్యార్థులకు ప్రభుత్వ గ్రాంటు** | ఆంధ్ర విశ్వవిద్యాలయం రూ. 35, 500 | శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం రూ. 37,300 | ఉస్మానియా విశ్వవిద్యాలయం రూ. 17,400 |
| **ఇప్పటి వరకు ఖర్చు చేసిన సొమ్ము (కోట్ల రూ.లలో)** | **1308.56** | **382.47** | **163.39** |

మొత్తం 22 విశ్వవిద్యాలయాల్లో ప్రతి ప్రాంతానికి ప్రత్యేకంగా రెండు విశ్వవిద్యాలయాలున్నాయి. తెలంగాణలో ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాలున్నాయి.

తొలుత జె.ఎన్.టి.యుని వరంగల్లులో, సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని నల్లగొండలో తలపెట్టారు. అయితే రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలని చెప్పి కొద్ది నెలల్లోనే వాటిని హైదరాబాద్‌కు తరలించారు. అయితే విజయవాడలో యన్.టి.ఆర్. ఆరోగ్య యూనివర్సిటీని, కుప్పంలో ద్రావిడ యూనివర్సిటీని స్థానికులకు ఉద్యోగాలు కల్పించే ఉద్ధేశంతో రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయాలు అయినా కూడా స్థాపించారు. ఆదిలాబాద్ జిల్లాలోని బాసరలో తలపెట్టిన ఐఐటిని హైదరాబాద్ శివారులోని మెదక్ జిల్లాలోకి మార్చారు. ఇది భూముల ధరలు పెంచి, రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచుకోవడానికి  అని మనకు తెలుసు.

మొన్నీమధ్య తెలంగాణలో నాలుగు విశ్వవిద్యాలయాల (తెలంగాణ, మహాత్మా గాంధీ, శాతవాహన, పాలమూరు

విశ్వవిద్యాలయాలు) స్థాపనకు ప్రభుత్వం మొత్తం 25 కోట్ల రూపాయలు విడుదల చేసింది. అయితే రాయలసీమలోని కడప జిల్లాలో వైయస్సార్ సొంత ఊరు ఇడుపులపాయలోని నాలెడ్జి విశ్వవిద్యాలయానికి మాత్రం 300 కోట్ల రూపాయలు కేటాయించింది.

కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలును, సిబ్బందిని సమకూర్చింది. తెలంగాణలోని కొత్తగా ఏర్పడిన విశ్వవిద్యాలయాలకు మాత్రం మొండిచేయి చూపింది.

**ఉపాధి రంగం :**

2001లో చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన గిర్గ్లాని కమీషన్ 2 లక్షల మంది తెలంగాణేతరులు తెలంగాణలో గవర్నమెంట్ ఉద్యోగాల్లో ఉన్నట్టు చెప్పింది.

ప్రస్తుతం తెలంగాణ ప్రాంతంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో 2.5 లక్షల మంది స్థానికేతరులు ఉద్యోగాలు పొందినట్లు తెలంగాణ ఉద్యోగ సంఘాలు అంచనా వేశాయి.

1986 డిసెంబర్ 31వ తేదీ నాటికి స్థానికేతరులను తమ తమ స్వస్థలాలకు పంపించివేయడానికి 1985 డిసెంబర్ 30వ తేదీన దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రభుత్వం ఉత్తర్వులు (G.O. 610) జారీ చేసింది. నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని అమలు చేయకపోగా, మొన్నీమధ్య వైయస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం తెలంగాణలోని ఒక జిల్లా నుండి మరో జిల్లాకు ఉద్యోగులను బదిలీచేసే పనికి పూనుకుంది, ఇది మరోమోసం.

సచివాలయంలో 5 వేల ఉద్యోగాలు ఉండగా 10% మంది మాత్రమే తెలంగాణకు చెందినవారు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత 50 ఏళ్లలో ఒక్కసారి కూడా తెలంగాణకు అడ్వొకేట్ జనరల్ పదవి దక్కలేదు. న్యాయమూర్తుల్లో 84 మంది ఆంధ్రప్రాంతానికి చెందినవారు ఉండగా రాయలసీమకు చెందినవారు 15 మంది, తెలంగాణకు చెందిన వారు 39 మంది మాత్రమే ఉన్నారు. వాణిజ్య పన్నుల అధికారుల్లో 418 మంది ఆంధ్రకు, 42 మంది రాయలసీమకు, 161 మంది తెలంగాణకు చెందినవారు ఉన్నారు.

రాష్ట్రంలోని 320 మంది ఐఏఎస్ అధికారుల్లో 27 మంది తెలంగాణవారున్నారు. అలాగే 230 మంది ఐపియస్ అధికారుల్లో తెలంగాణ అధికారులు 15 మందే. 23 మంది జిల్లా కలెక్టర్లలో తెలంగాణవారు మనకు అసలే అగుపడరు. విధాన నిర్ణయాల అధికారం తెలంగాణేతరుల చేతుల్లో ఉందనడానికి ఇది ప్రబల నిదర్శనం. దాని వల్ల సహజంగానే తెలంగాణ ప్రజలకు అభివృద్ధిలో భాగం దక్కలేదు.

ఆర్థికపరమైన అన్యాయానికి కూడా తెలంగాణవారు గురవుతున్నారు. గత 25 ఏళ్లలో తెలంగాణ ప్రాంతంలో పనిచేస్తున్న తెలంగాణేతరులు 2 లక్షల 50 వేల మంది సగటున నెలకు 7,500 రూపాయలు పొందుతూవుంటే ఆ రకంగా గత 25 ఏళ్లలో అది 300 నెలలు అవుతుంది. తెలంగాణ ఉద్యోగులు ఆ రకంగా ఆదాయ అవకాశాలను వేతనాల్లో 56,250 కోట్ల రూపాయలు కోల్పోయారు.

హైదరాబాద్‌లోని సచివాలయం, నీటి పారుదల, రోడ్లు, భవనాలు, పోలీసు, హైకోర్టు వంటి ప్రభుత్వ శాఖల్లో 90 శాతం

మంది తెలంగాణేతరులే ఉన్నారు. దానివల్ల తెలంగాణ ప్రాజెక్టులపై వారికి ఆసక్తి ఉంటుందనుకోవడం అపోహ.

**నీటిపారుదల :**

కృష్ణానది క్యాచ్‌మెంట్ ఏరియా 69 శాతం, గోదావరి క్యాచ్ మెంట్ ఏరియా 79 శాతం తెలంగాణలో ఉన్నాయి.

బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా నది జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టిఎంసిల్లో తెలంగాణకు 480 టిఎంసిల జలాలు దక్కాల్సి ఉంది. అయితే కృష్ణా నది జలాల్లో తెలంగాణకు 130 టిఎంసిల నీళ్లు మాత్రమే దక్కుతున్నాయి. కృష్ణానది జలాలు మొత్తం 35 లక్షల ఎకరాలకు అందుతుంటే అందులో ఐదు లక్షల ఎకరాలు మాత్రమే తెలంగాణలో ఉన్నాయి.

గోదావరిలోని 1430 టిఎంసిల్లో తెలంగాణకు 760 టిఎంసిల జలాలు దక్కాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు తెలంగాణకు 200 టిఎంసిలు మాత్రమే అందుతున్నాయి. గోదావరి జలాల ద్వారా ఆంధ్రలో 12 లక్షల ఎకరాలు

సాగవుతుంటే తెలంగాణలో 4 లక్షల ఎకరాలు మాత్రమే విడిచిపెడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు హైదరాబాద్ రాష్ట్ర రాజోలిబండ డైవర్షన్ స్కీం పథకాన్ని చేపట్టింది. దీని ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలోని 87,500 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. అయితే కర్నూలు జిల్లాలోని కొంత మంది భూస్వాములు దాని ద్వారా తెలంగాణకు నీరే రాకుండా చేస్తున్నారు. కొంతమంది పాలక పార్టీ నాయకులు రాజోలిబండ డైవర్షన్ స్కీం గేట్లను ధ్వంసం చేసి కర్నూలు జిల్లాకు నీరు మళ్లించుకున్నారు. దీనితో మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం నీరు కరువైంది.

ప్రథమ పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయానికి భారత ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 1956 నుంచి 2002 వరకు వ్యవసాయంపై దాదాపు 12,104 కోట్ల రూపాయలు వెచ్చించారు. దీనివల్ల సేద్యం భూమి 27.47 లక్షల ఎకరాల నుంచి 55 లక్షల ఎకరాలకు పెరిగింది. ఇందులో

ఎక్కువ భాగం ఆంధ్రప్రాంతంలోనే ఉంది. తెలంగాణలోని చిన్న నీటి పారుదలపై పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించారు.

ప్రణాళికా సంఘం నివేదిక ప్రకారమే కాలువల ద్వారా ఆంధ్రప్రాంతంలో 79 శాతం సాగవుతుంటే తెలంగాణలో 17 శాతం మాత్రమే సాగవుతోంది.

1960 నాటికి తెలంగాణలో 4 వేల చెరువులు, కుంటలున్నాయి. వాటి ద్వారా తెలంగాణలో 13 లక్షల ఎకరాల భూములు సాగవుతూ వస్తుండేవి. రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఆ సాగు విస్తీర్ణం ఐదు లక్షల ఎకరాలకు తగ్గిపోయింది. చెరువుల్లో, కుంటల్లో మేటలు వేసిన ఇసుకను తోడివేసే పనులు జరగలేదు. వాటి గండ్లను పూడ్చలేదు. పట్టణీకరణలో భాగంగా కొన్ని చెరువులను ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారు. దీంతో తెలంగాణలోని వ్యవసాయోత్పత్తులపై ప్రతికూల ప్రభావం పడింది. గత యాభై ఏళ్ల తెలంగాణలో సేద్య భూమూలు 27 శాతానికి తగ్గాయి.

ఆంధ్రప్రాంతంలో ప్రాజెక్టుల కింద కాల్వల ద్వారా రైతులు సాగునీరు పొందుతుంటే, తెలంగాణ రైతులు బావులు తవ్వుకుని విద్యుత్ పంపుసెట్లను పెట్టుకోవాల్సి వస్తుంది. అదనంగా విద్యుత్తు కోసం నెలకు 300 రూపాయల చొప్పున చెల్లించాల్సి వస్తున్నది. అటువంటి ఖర్చులేమీ లేకుండా ఆంధ్ర రైతులు మాత్రం నీటిని కాల్వల ద్వారా పొందుతున్నారు.

పైగా, ఆంధ్ర ప్రాంత వ్యవసాయ భూములకు నీరు అందించడానికి తెలంగాణ ప్రాంతంలోని భూములకు కాలువల నీటిని తగ్గిస్తున్న పరిస్థితి కూడా కొనసాగుతున్నది. ఆంధ్ర ప్రాంతం భూములకు సాగునీరందించడానికి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టులపై కోట్లాది రూపాయల ఖర్చు చేస్తూ వస్తున్నాయి.

ఆంధ్ర ప్రాంతంలోని ఒక్క గుంటూరు జిల్లాలో ఎంత సేద్యం భూమి ఉందో  తెలంగాణ వ్యాప్తంగా మొత్తం అంత భూమే సాగవుతున్నది.

నదీ జలాల్లో న్యాయమైన వాటా దక్కి ఉంటే మరో 30 లక్షల ఎకరాలు తెలంగాణలో గత యాభై ఏళ్లలో సాగులోకి వచ్చి ఉండేది. దాని వల్ల తెలంగాణ దాదాపు లక్షాయాభైవేల కోట్ల రూపాయల విలువ చేసే వ్యవసాయ దిగుబడుల సామర్థ్యాన్ని నష్టపోయింది.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ద్వారా కృష్ణా జలాలను రాయలసీమకు తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీసి మళ్ళించే ప్రయత్నం జరుగుతున్నది. దీనివల్ల నల్లగొండ, ఖమ్మం (తెలంగాణ), కృష్ణా, గుంటూరు, ప్రకాశం (ఆంధ్ర) జిల్లాల ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుంది. దానికి 24 టిఎంసిల నికర జలాలు మాత్రమే అందుబాటులో ఉండగా 300 టిఎంసిల నీటిని రాయలసీమకు తరలించే ఏర్పాటు జరిగింది. దీనివల్ల మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలకు మొన్నీమధ్య వరద ముప్పు కూడా సంభవించింది. నాగార్జునసాగర్‌లో అదనపు జలాలను నిలువ చేయడం వల్ల, ఆ జలాలను కృష్ణా జిల్లాకు విడుదల చేయకపోవడం వల్ల

శ్రీశైలం బ్యాక్ వాటర్ పొంగిపొర్లి కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలలోని పలు ప్రాంతాలను ముంచేసింది.

తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో తలపెట్టిన పోలవరం ప్రాజెక్టు వల్ల భద్రాచలంతో పాటు 220 గ్రామాలు ముంపునకు గురవుతాయి. దాదాపు 3 లక్షల మంది నిరాశ్రయులవుతారు. ఈ ప్రాజెక్టును తెలంగాణలో ప్రతిపాదించినప్పటికీ తెలంగాణలోని ఒక్క ఎకరానికి కూడా నీరు అందదు. దాని ద్వారా ఆంధ్ర ప్రాంతంలోని 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం జలయజ్ఞం ద్వారా లక్ష కోట్ల రూపాయలతో 26 ప్రాజెక్టుల ద్వారా 56 లక్షల ఎకరాల భూములు అదనంగా సాగవుతుంది అని అంచనావేసింది. అయితే ఇందులో ఆంధ్ర ప్రాంతంలో 43 లక్షల ఎకరాలుండగా, తెలంగాణలో 13 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నాయి.

**ఆర్థిక వ్యవస్థ :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు ముందు 1956లో హైదరాబాద్ రాష్ట్రానికి రెవెన్యూ మిగులు 34 కోట్ల రూపాయలు, ప్రతి ఐదేళ్లకోసారి అది రెండింతలైతే ఆ ప్రకారం ఇప్పటికి అది 70 వేల కోట్ల రూపాయలకు చేరుకుంటుందని అంచనా. అప్పట్లో ఆంధ్ర రాష్ట్రం ఐదు కోట్ల లోటుతో ఉంది. ఉద్యోగుల వేతనాలను కూడా చెల్లించలేని స్థితిలో ఉండేది.

ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో నిజాం 12 కోట్ల విలవ చేసే సెక్యూరిటీ బాండ్లు కూడా ఇచ్చారు.

ప్రస్తుతం పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు 50 శాతం రెవెన్యూ తెలంగాణ నుండి వస్తున్నది. అయితే 25 నుండి 29 శాతం మాత్రమే తెలంగాణలో ఖర్చు పెడుతున్నారు.

సెజ్‌లు, ఐటి పార్కులు వంటి వాటి పేరు మీద పభుత్వం గత దశాబ్దకాలంలో 20 వేల కోట్ల విలువ చేసే భూములను హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాలో విక్రయించింది. భూములు అమ్మడం ద్వారా వచ్చిన సొమ్మును ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి మళ్లించారు.

**వైద్య, ఆరోగ్య సేవలు:**

***1956కి పూర్వమే తెలంగాణ ప్రాంతంలో ఎన్నో ఆస్పత్రులున్నాయి వాటిలో ముఖ్యమైనవి***

ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, గాంధీ ఆస్పత్రి, నిమ్స్, నిలోఫర్ ఆస్పత్రి, ఇఎన్టీ ఆస్పత్రి, ఫీవర్ ఆస్పత్రి, ఎర్రగడ్డ పిచ్చాసుపత్రి, టిబి ఆస్పత్రి, కోఠీ జనరల్ ఆస్పత్రి, పలు ఆయుర్వేద, యునానీ ఆస్పత్రులు, ఇవన్నీ నిజాం కాలంలో ఏర్పాటు చేసినవే.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత వరంగల్లులోని ఎంజిఎం తప్ప ప్రధాన ఆస్పత్రి ఏదీ కూడా తెలంగాణ ప్రాంతంలో రాలేదు. వివిధ ప్రాంతాల ఆసుపత్రులను ఈ క్రింద చూద్దాం.

**ఆస్పత్రులు**

| | | |
|---|---|---|
| ఆంధ్రలో | : | 666 |
| రాయలసీమలో | : | 303 |
| తెలంగాణలో | : | 270 |

(యూనాని, అల్లోపతి, ఆయుర్వేదం మరియు హోమియోపతి కలిపి)

## పరిశ్రమలు మరియు విద్యుత్తు వినియోగం

ఆంధ్రలో 6045 లఘు, చిన్నతరహా, మధ్యతరహా ఉత్పత్తి యూనిట్లున్నాయి. వీటికి 54 శాతం విద్యుత్తు వినియోగం జరుగుతున్నది. రాయలసీమలో 773 యూనిట్లు 23 శాతం విద్యుత్తును వినియోగించుకుంటున్నాయి. కానీ తెలంగాణలోని 1253 యూనిట్లు 23 శాతం విద్యుత్తును మాత్రమే వినియోగించుకుంటున్నాయి.

నిజాం కాలంనాటి ఆజం జాహీ మిల్స్, సిర్పూర్ పేపర్ మిల్స్ వంటి ఎన్నో పరిశ్రమలు నేడు తెలంగాణలో మూతపడ్డాయి. దీనివల్ల వేలాది మంది తెలంగాణవారు ఉద్యోగాలు కోల్పోయారు. కాని విశాఖ, విజయవాడ, కాకినాడ నెల్లూరు, తిరుపతి, కడప వంటి చోట్ల ప్రభుత్వం పలు పరిశ్రమలు స్థాపించడానికి సహకరించింది. ఒక్క విశాఖ ఉక్కు కర్మాగారానికే ప్రభుత్వం 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

ఇప్పటి వరకు ప్రభుత్వాలు తాము అభివృద్ధి చేశామనే మాటల్లో ఏ మాత్రం నిజం లేదు. హైదరాబాద్ చుట్టుపక్కల

పలు ఫార్మాస్యూటికల్ ఉత్పత్తి యూనిట్లను తెరిచారు. దీనివల్ల పటాన్‌చెరు, జీడిమెట్ల, కాటేదాన్, బాలానగర్, బొల్లారం వంటి ప్రాంతాల్లో నీరు, గాలి కలుషితమై పోయింది. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక ఈ కంపెనీల్లో పనిచేస్తున్న వారిలో 90 శాతం మంది ఆంధ్ర ప్రాంతానికి చెందినవారే.

ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణలోని చేనేత, పవర్లూమ్ వంటి కాటేజీ పరిశ్రమలు వందలకొద్ది మూతపడ్డాయి.

**లఘు, కాటేజీ, చేనేత పరిశ్రమల పట్ల నిర్లక్ష్యం**

ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణలోని పలు లఘు, కాటేజీ పరిశ్రమలు మూతపడ్డాయి. స్థానికేతరులు నెలకొల్పిన ఐటి, ఫార్మా కంపెనీలకు పన్ను రాయితీలు, ప్రోత్సహకాలు ఇచ్చిన ప్రభుత్వం తెలంగాణలోని చేనేత, లఘు, కాటేజీ పరిశ్రమల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

రాష్ట్రంలో ఈ ఏడాది రూ. 324 కోట్ల చేనేత రుణాలను ప్రభుత్వం రద్దు చేయడానికి ఇప్పటివరకు నాన్చుతుంది. అందులో

తెలంగాణకు సంబంధించి దాదాపు 140 కోట్ల రుణాలుంటా యేమో. అయితే ప్రభుత్వం గర్వంగా చెప్పే ఒక లక్ష కోట్ల రూపాయల రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. దీంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో చేనేత కార్మికుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కాని ఎన్నో బడా షాపింగ్ మాల్స్‌కు ప్రభుత్వం అనుమతించింది. ఇవి ప్రత్యక్షంగా తెలంగాణలోని చేనేత కార్మికుల పొట్టలు కొడుతున్నాయి.

తెలంగాణలో తాటి చెట్లు విరివిగా ఉన్నాయి. అయితే కల్లును బహిరంగంగా అమ్మడానికి ప్రభుత్వం అనుమతించడం లేదు. నగర పరిధిలో కల్లు విక్రయాలపై ప్రభుత్వాలు నిషేధం విధించాయి. కోస్తాంధ్రలోని కొబ్బరి నీళ్ల వ్యాపారాన్ని మాత్రం తెలంగాణతో సహా అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అవకాశం కల్పించింది. దీనివల్ల కొన్ని కోట్ల రూపాయల బిజినెస్ జరుగుతుంది.

కాకతీయు కాలం నుంచి ప్రసిద్ధి చెందిన పెంబర్తి షీట్ క్రాఫ్ట్, బ్రాస్ వేర్ క్రాఫ్ట్‌లను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి.

## రాజకీయాధికారం

గత 53 ఏళ్లలో రాష్ట్ర చరిత్రలో అభివృద్ధిలో రాజకీయాధికారం కీలక పాత్ర పోషించింది. ఆంధ్ర ముఖ్యమంత్రులు 24 ఏళ్ళు, రాయలసీమ ముఖ్యమంత్రులు 22 ఏళ్లు, తెలంగాణ ముఖ్యమంత్రులు 6 ఏళ్లు మాత్రమే పాలించారు. తెలంగాణ ముఖ్యమంత్రులు ఎవరు కూడా పూర్తి అధికారాన్ని వినియోగించుకుని పూర్తి ఐదేళ్లపాటు సాగకుండానే చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రుల పరిపాలన సాగించడానికి అవకాశం కల్పించి ఉంటే పరిస్థితి భిన్నంగానే ఉండేది. ఒత్తిడి రాజకీయాల వల్ల మేధావి అయిన పి.వి. నరసింహారావు కూడా పూర్తి కాలం ముఖ్యమంత్రిగా కొనసాగలేకపోయారు. మర్రి చెన్నారెడ్డిని గద్దె దించడానికి తెలంగాణేతర నాయకుడు హైదరాబాదులో మతకల్లోలాలు సృషించాడనే ఆరోపణ కూడా ఉంది. అందువల్ల తెలంగాణకు చెందిన ముఖ్యమంత్రులు తెలంగాణకు ఏమీ చేయలేకపోయారు.

## పట్టణాభివృద్ధి

జెఎన్ఎన్యుఆర్ఎం పథకం కింద కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తుంది. వాటిలో వందలాది కోట్ల రూపాయలు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాలను అభివృద్ధి చేయడానికి మాత్రమే ఖర్చు చేశారు. హైదరాబాద్ మినహా ఇతర నగరాలేవీ అభివృద్ధి చెందలేదనేది పెద్ద అసత్యం. మరి విశాఖ, విజయవాడ నగరాలను ఎవరు అభివృద్ధి చేశారు, అవి గత 53 సంవత్సరాల ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి చెందలేదా? హైదరాబాద్ మినహా అభివృద్ధి చెందిన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తెలంగాణేతర ప్రాంతాల్లోనే ఉన్నాయి కదా.

## ప్రభుత్వ రియల్ ఎస్టేట్ వ్యాపారం

ప్రధాన పట్టణాలు, నగరాలు, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లోని చిన్న, సన్నకారు రైతులు నిస్సహాయులుగా మారిపోయారు. తెలంగాణ రైతులు స్పెషల్ ఎకానామిక్ జోన్ (సెజ్)ల అభివృద్ధికి బలవంతంగా తమ

భూములను ఎపిఐఐసికి విక్రయించాల్సి వచ్చింది. భూలావాదేవీల్లో ఎపిఐఐసి మధ్యదళారీగా మారిపోయింది. ఎపిఐఐసి వందలాది ఎకరాలు సేకరించి ఆంధ్ర, రాయలసీమ పెద్దలకు మరియు ఇతర కంపెనీలకు చాలా తక్కువ ధరలో కట్టబెట్టింది. సెజ్‌లకు పన్ను మినహాయింఉలు, ప్రోత్సహకాలను ప్రభుత్వం ఇస్తుంది. అవి మాత్రం స్థానికులకు ఉపాధిని కల్పించవు. ప్రత్యేక ఆర్థికమండళ్లు (సెజ్ లు) పరిసరాల అసమతుల్యతకు, ఆహార కొరతకు కారణమవుతాయి. సెజ్‌లకు కేటాయించిన వందలాది ఎకరాల్లో నాలుగో వంతు మాత్రమే వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. మిగతా భూమలును రియల్ ఎస్టేట్ వెంచర్స్‌కు మారుస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఆంధ్ర మరియు సీమ పెట్టుబడిదారులకు ఆ భూములు బంగారు పంట పండిస్తున్నాయి. లగడపాటి రాజగోపాల్ వక్ఫ భూములను, ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను ఆక్రమించుకుని ల్యాంకో హిల్స్ ప్రాజెక్టును చేపట్టారు. దానితో వందల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు.

## సింగరేణిలో ఓపెన్ కాస్ట్ మైనింగ్

తెలంగాణలోని సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో మణుగూరు, ఇల్లందు, కోయగూడెం, కొత్తగూడెం, కైరిగూడా, సత్తుపల్లి, డోర్లీ, అబ్బాపూర్, శ్రీరాంపూర్, భూపాలపల్లి వంటి 14 చోట్ల ఓపెన్ కాస్ట్ మైనింగ్ జరుగుతోంది. దాని వల్ల వాతావరణ కాలుష్యం, అడవుల ధ్వంసం, ప్రజల స్థానభ్రంశం చోటు చేసుకుంటున్నాయి. నిరాశ్రయులవుతున్న ప్రజలకు సరైన పునరావాసం కూడా కల్పించడం లేదు.

## నల్లగొండ జిల్లాలోని జలాల్లో ఫ్లోరైడ్ సమస్య

కృష్ణా నది నల్లగొండ జిల్లా మీదుగా పారుతుంది. కానీ ఆ నదీ జలాలు నల్లగొండ జిల్లా రైతులకు అందుబాటులోకి రాలేదు. పైగా నల్లగొండ జిల్లాలోని భూగర్భ జలాల్లో మోతాదుకు మించి ఫ్లోరైడ్ ఉంది. దాంతో ఆ జలాలు విషపూరితంగా మారాయి. ఆ జలాలను తాగడం వల్ల ప్రజలు డెంటల్, స్కెలెటల్ (బొక్కల) ఫ్లోరోసిస్‌కు గురువుతున్నారు. నల్లగొండ జిల్లాలోని 885 గ్రామాలు ఫ్లోరోసిస్‌కు గురయ్యాయి.

దాని వల్ల ఆరు లక్షల మంది బాధితులుగా మారారు. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం కృషి చేయలేదు. (WHO) వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కూడా వారి రిపోర్టులో నల్లగొండలోని ఫ్లోరైడ్ సమస్య గురించి ఆందోళన వ్యక్తం చేసింది.

**ఖనిజ వనరులు, అడువులు**

ఆంధ్రప్రదేశ్‌లోని వందశాతం బొగ్గు తెలంగాణ ప్రాంతంలోనే ఉత్పత్తి అవుతుంది. ఈ బొగ్గును థర్మల్ విద్యుత్కేంద్రాలకు వాడుతున్నారు. తెలంగాణలో వున్న విద్యుత్కేంధ్రాల ద్వారా మొత్తం దక్షిణ భారతదేశానికి విద్యుత్ సరఫరా అవుతుంది. కాని ఆంధ్రలో వున్న విద్యుత్కేంద్రాల నుండి ఆంధ్రకే సరఫరా అవుతుంది. తెలంగాణ రైతులకు వారి పంటకు 2-4 గంటల విద్యుత్ మాత్రమే సరఫరా అవుతున్నది. తెలంగాణలో భారీ సున్నంరాయి నిక్షేపాలున్నాయి. ఆంధ్ర నుండి వచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నల్లగొండ జిల్లాలో సిమెంట్ కర్మాగారాలు స్థాపించి ఈ సున్నపురాయిని

ముడిసరుకుగా వాడుకుంటున్నాయి. తెలంగాణలో పలు జిల్లాల్లో విస్తారంగా అడవులు ఉన్నాయి. వాటిని కూడా అభివృద్ధికి ఉపయోగించటం లేదు.

## ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ కులాలకు (ఎస్.సి.) విద్య, ఉద్యోగాల్లో 15 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మొత్తం ఎస్సీల్లో 51 శాతం మంది మాదిగలు, 43 శాతం మంది మాలలు, 6 శాతం మంది ఇతర ఎస్సీలు ఉన్నారు. ప్రభుత్వ రంగంలోని విద్య, ఉద్యోగాల్లోని ఎస్సీ రిజర్వేషన్లు దాదాపు పూర్తిగా మాలలే వినియోగించుకుంటున్నారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీయస్) గత పదేళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పోరాటం చేస్తూ వస్తున్నది. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలకు, ఇతర ఎస్సీ గ్రూపులకు తగిన కోటా లభించడానికి వీలుగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలని జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్ కూడా సూచించాయి.

వర్గీకరణకు కాంగ్రెసు ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఆంధ్రప్రాంతానికి చెందిన ఆధిపత్య మాలల ఒత్తిడి వల్ల ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు పెట్టడం లేదు. మొత్తం మాదిగల్లో 70 శాతం మంది తెలంగాణలోనే ఉంటారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వల్ల మాదిగలకు ప్రయోజనం చేకూరుతుంది.

## ఆంధ్ర వలసవాదం

ఆంధ్ర, రాయలసీమల నుంచి వలసలు పెరగడం వల్ల తెలంగాణ జనాభాలో 18 శాతం పెరుగుదల కనిపిస్తుంది. గత 30 ఏళ్లలో హైదరాబాదులోనే కాకుండా తెలంగాణలోని ప్రధాన పట్టణాల్లో పలు కాలనీలు వెలిశాయి.

## తెలంగాణ అమరవీరులు, నాయకుల విస్మరణ

తెలంగాణకు చెందిన రామనంద తీర్థ, కె.వి. రంగారెడ్డి, దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట ఆళ్వారుస్వామి, కొమురం భీం, రావి నారాయణ రెడ్డి, షోయబుల్లా ఖాన్, తుర్రేబాజ్‌ఖాన్, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, కాళోజీ నారాయణరావు

వంటి మహానుభావులకు ఏ విధమైన గుర్తింపు ప్రభుత్వాలు కల్పించడం లేదు. తెలంగాణ ప్రాంతానికి ఏమీ చేయని ఆంధ్ర నాయకులు పేర్లు మాత్రం ఇక్కడి వీధులకు, రోడ్లకు, కాలనీలకు పెట్టుకుంటున్నారు. వారి విగ్రహాలు పలు ప్రాంతాల్లో స్థాపిస్తున్నారు. హైదరాబాదులోని ట్యాంక్‌బండ్‌పైనున్న విగ్రహాల్లో తెలంగాణకు చెందినవారిని రెండు మూడు మాత్రమే.

## హైదరాబాద్ (హైదర్ - ఆబాద్), సికింద్రాబాద్ (సికిందర్-ఆబాద్) జంటనగరాలు

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసినట్లు ఆంధ్ర, సీమ పాలకులు గొంతు చించుకుంటున్నారు. నిజానికి, విలీనానికి ముందే హైదరాబాద్‌లో అన్ని మౌలిక వసతులున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వమే భారతదేశానికి హైదరాబాద్‌ని రెండో రాజధానిగా చేయాలని డా॥ అంబేద్కర్ ప్రతిపాదించారు. విలీనానికి ముందు దేశంలో హైదరాబాద్ ఐదో అతి పెద్ద నగరం ఇప్పుడు కూడా హైదరాబాద్ స్థానం

అదే.

చాళుక్యులు, చోళులు, బహమనీలు, కతుబ్‌షాహీలు, మొఘుల్స్, చివరిగా నిజామ్‌లు హైదరాబాద్‌పై తమదైన ముద్రలు వేశారు. ముత్యాలు, ఆభరణాలు, చుడి బజార్, బిర్యానీ, మొఘలాయి వంటలు, దక్కనీ సంస్కృతి (దక్షిణ, ఉత్తర భారత సంస్కృతీ సమ్మేళనం) లకు హైదరాబాద్ ప్రసిద్ధి. హిందూ, ముస్లీం కవులు తెలుగు మరియు ఉర్దూ సాహిత్యానికి ఎంతో కృషి అందించారు. కన్నడిగులకు, మరాఠీలకు, తమిళులకు, మలయాళీలకు, సింధీలకు, పార్సీలకు, గుజరాతీలకు, రాజస్తానీలకు, బెంగాలీలకు తదితరులు హైదరాబాద్‌లో గత శతాబ్ద కాలంగా ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు హైదరాబాద్‌లో మతఘర్షణలు ఎప్పుడూ జరగలేదు. సాయుధ పోరాట కాలంలో సాగిన దమనకాండ బయటి నుంచి వచ్చిన రజాకార్ల వల్ల మరియు హైదరాబాద్ రాజ్యాన్ని తమ చెప్పుచేతుల్లోకి తీసుకోవడానికి ప్రయత్నించడం వల్ల జరిగిందే తప్ప ఇవి మత ఘర్షణలు కావు. ఈ దమనకాండకు మతంకన్నా పాలకవర్గ అలసత్వమే కారణమైంది. హైదరాబాద్‌లో ప్రజలకు

మంచినీరు అందించడానికి నిజాం హయాం నాటికే 200 సరస్సులున్నాయి. వందలాది ఏళ్లుగా హైదరాబాద్ పర్యాటక స్థలంగా వర్థిల్లుతున్నది. చార్మినార్, మినార్లు, సాలార్‌జంగ్ మ్యూజియం, కుతుబ్‌షాహీ సమాధులు, హుస్సేన్‌సాగర్, గండిపేట, గోల్కొండ తదితర ఎన్నో ఆసక్తికరమైన చారిత్రక కట్టడాలున్నాయి. ఎంతోమంది పండితులు, చరిత్రకారులు, యాత్రికులు వివిధ దేశాలనుండి హైదరాబాద్‌ను సందర్శించి దాని సాంస్కృతి వారసత్వాన్ని ప్రశసించారు.

## నేటి హైదరాబాద్ మరియు మిగతా తెలంగాణ ప్రాంతం

గత దశాబ్ది కాలంలో హైదరాబాదులో బహుళజాతి సంస్థలతో పాటు పలు ఐటి సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. వీటిలో ఆంధ్ర మరియు సీమ ప్రాంతం వారు నెలకొల్పినవి కొన్ని మాత్రమే. మౌలిక సదుపాయాలు ఉండడం, ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వడం, చౌక ధరలకు భూములు ఇవ్వడం, ఏయిర్‌పోర్టు ఉండడం, నైపుణ్యం గల మానవ వనరులు అందుబాటులో ఉండడం అందుకు ప్రధాన కారణం. పైగా భౌగోళికంగా అమెరికాతో 11 గంటల సమయం వ్యత్యాసం

కూడా అందుకు మరో ప్రధాన కారణం. కాని తెలంగాణ ప్రాంతానికి చెందిన వారు 15 నుంచి 20 శాతం మంది మాత్రమే ఈ సంస్థలల్లో పనిచేస్తున్నారు.

హైదరాబాదులోని ఫ్లై ఓవర్లు, విశాలమైన రోడ్లు, హైటెక్ సిటి బిల్డింగ్ వంటి ఆధునిక హంగులు తెలంగాణ జిల్లాలోని తీవ్రమైన సమస్యలకు పరిష్కారం కావు. ఆదిలాబాద్ జిల్లాలో కలరా మరణాలు, గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, మహబూబ్‌నగర్ జిల్లాలో కరవు వలసలు, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్, నిజాంసాగర్ కింద ఆయకట్టు తగ్గుదల, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కాలుష్యం వంటి సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాల్సి ఉంది. కానీ వాటిని ప్రభుత్వాలు పట్టించుకోలేదు.

హైదరాబాద్ అభివృద్ధి పేరు మీద చేపట్టిన రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, విమానాశ్రయం, ప్రాజెక్టులు, సెజ్ వంటి కార్యక్రమాల వల్ల తెలంగాణ ప్రజలు భూములు, నీళ్లు

కోల్పోయారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడుతున్న ఆంధ్ర, రాయలసీమ పెద్దలు వారి వ్యాపార అభివృద్ధి కోసం వీటిని ఏర్పాటు చేసుకున్నారే తప్ప తెలంగాణ ప్రజలకు ఒరిగిందేమీ లేదు. పైగా ఎంతోమంది తెలంగాణ వాసులు వారి తాతల నాటి భూములను కోల్పోయారు.

చౌకగా భూముల కేటాయింపు, విద్యుత్తు, నీళ్లు వంటి సౌకర్యాల కల్పన వల్ల, పలు రాయితీల వల్ల హైదరాబాదుకు సినీ పరిశ్రమ వచ్చి స్థిరపడింది. దురదృష్టవశాత్తు, రెండు పెద్ద నిర్మాణ సంస్థలు తెలంగాణలోని ఎన్నో సినిమా హాళ్లను తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. తద్వారా తెలంగాణలో సినీ పరిశ్రమను ఆ రెండు సంస్థలు నియంత్రిస్తున్నాయి. దీంతో తెలంగాణకు చెందిన చిన్నస్థాయి నిర్మాతలు సినీ పరిశ్రమలోకి ప్రవేశించ లేకపోతున్నారు. ఒక వేళ ప్రవేశించినా నిలదొక్కు కోనివ్వటం లేదు.

రాజకీయాధికారం కొద్దిమంది స్థానికేతురుల చేతుల్లో ఉండడం వల్ల తెలంగాణ ప్రజలు రెండో తరగతి పౌరులుగా

జీవించాల్సిన దుస్థితి పట్టింది. తెలంగాణ సంస్కృతిని, భాషను, యాసను అవమానకరమైన రీతిలో సినిమాల్లో వాడుతున్నారు. విలన్లకు, జోకర్లకు, దుష్ట రాజకీయ నేతలకు తెలంగాణ భాషను, యాసను వాడుతూ, తెలంగాణ నాయకులను అధికార కాంక్షగలవారిగా చూపుతూ అవమానాలకు గురి చేస్తున్నారు.

హైదరాబాదులో స్థిరపడిన ఆంధ్ర, రాయలసీమ పెట్టుబడిదారులు రంగారెడ్డి, హైదరాబాదుల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారంపై గుత్తాధిపత్యం వహిస్తూ హైదరాబాదు ఆవల 75 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో వారి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు.

## హైదరాబాద్ - స్కామ్ రాజధాని ?

భారతదేశంలో ఐ.టి.కి మరియు సేవల రంగానికి అనువైన కేంద్రంగా హైదరాబాద్ రూపు దిద్దుకుంటుందని గొప్పగా చెప్తారు. అయితే అదే హైదరాబాద్ భారత కుంభకోణాల రాజధానిగా అపకీర్తిని కూడా మూటగట్టు కుంటున్నది. ఇటీవలి కాలంలో పలు కుంభకోణాలు

హైదరాబాద్‌లోనే వెలుగు చూశాయి. కృషి బ్యాంక్, చార్మినార్ బ్యాంక్, వాసవి బ్యాంక్, ప్రుడెన్షియల్, గ్లోబల్ ట్రస్టు బ్యాంకుల కేసులు, నాగార్జున ఫైనాన్స్ కుంభకోణాలు హైదరాబాద్‌పై మాయని మచ్చలే. ఇక సత్యం కంప్యూటర్స్ వ్యవస్థాపకుడు రామలింగరాజు కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా హైదరాబాదుకు తెచ్చిన మచ్చ ఎన్నటికీ మాయనిది. దేశంలో అతి పెద్ద వైట్ కాలర్ నేరంగా దీన్ని చెప్తున్నారు. తాను 7 వేల 8 వందల కోట్లకు పైబడి అక్రమాలకు పాల్పడినట్లు రామలింగరాజు స్వయంగా అంగీకరించాడు.

*Source : www.bharatwaves.com*

మీడియా, ప్రభుత్వం దీనిని 7800 కోట్ల స్కామ్‌గా ప్రకటించగా, నిజానికి సత్యం కుంభకోణంలో ఇన్వెస్టర్లకు జరిగిన నష్టం 14 వేల కోట్ల రూపాయల మేరకు ఉంటుందని సిబిఐ లెక్కల ప్రకారం తెలుస్తున్నది.

ఈ కుంభకోణాలకు పాల్పడినవారందరూ వాస్తవంగా హైదరాబాదీలు కారు. అయినప్పటికీ రాజకీయ పెద్దలతో

కుమ్మక్కయి వ్యాపారం పేర, ఇతర పెట్టుబడుల పేర సామాన్య ప్రజలను మోసం చేశారు. తద్వారా హైదరాబాద్‌కు అపకీర్తి తెచ్చిపెట్టారు. ఆ కుంభకోణాలను అన్నింటినీ మీడియా హైదరాబాదుకు అంటగడుతున్నది. తద్వారా "బ్రాండ్ హైదరాబాద్"కు నష్టం కలగడం లేదా? దీనికి సమాధానం ఎవరైన చెప్పుతారా?

## ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవసరానికి గల కారణాలు

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని చెప్పడానికి ఎన్నో కారణాలున్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం.

### తెలంగాణ 1956కు ముందే ప్రత్యేక రాష్ట్రంగా ఉంది.

❖ గత 53 ఏళ్లుగా ఆంధ్ర, రాయలసీమ రాజకీయ నాయకత్వాలు తెలంగాణపై ఆధిపత్యం వహిస్తూ ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థను బలహీనపరిచారు, ధ్వంసం చేశారు. కాబట్టి తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవాన్ని, స్వయం పాలనను, అభివృద్ధిని కోరుకుంటున్నారు.

❖ తెలుగు భాష ఒక్కటే అయినా తెలంగాణ ప్రజల మాండలికం వేరు. అంతేకాకుండా సాంస్కృతిక భిన్నత్వం కూడా ఉంది.

❖ తెలంగాణప్రాంతం 1,14,800 చ.కీమీతో భారతదేశంలోని 18 (అస్సాం, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, జార్ఖండ్, ఉత్తరాంచల్, జమ్మూకాశ్మీర్, మిజోరం, పంజాబ్, గోవా, చత్తీస్‌ఘడ్, మణిపూర్, పశ్చిమ బెంగాల్, కేరళ) రాష్ట్రాల కన్నా తెలంగాణ పెద్దది. ప్రపంచంలోనే 100 దేశాల కన్నా పెద్దది.

❖ విద్య, ఉపాధి, వనరులు, ఆర్థికం, సౌకర్యాల వంటి అన్ని రంగాల్లో తెలంగాణ ప్రజలకు న్యాయమైన వాటా దక్కలేదు కాబట్టి గత ఐదు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ప్రజలు ఉద్యమిస్తూనే ఉన్నారు.

❖ తెలంగాణ ప్రజలు దేశం నుంచి విడిపోవాలని కోరుకోవడం లేదు. హైదరాబాద్ రాష్ట్రాన్ని పునరుద్ధరించాలని మాత్రమే కోరుకుంటున్నారు ఇది ప్రజాస్వామ్య హక్కు.

❖ తెలంగాణ ప్రజలు, నాయకులు తమ ప్రాంతంలోని ఖనిజ సంపదను, సహజ వనరులను పూర్తిగా వినియోగంలోకి తెచ్చుకుని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుకోవడానికి స్వయం పాలనను కోరుతున్నారు.

❖ తెలంగాణలో ముస్లిం జనాభా గణనీయంగా ఉంది. గత హైదరాబాద్ రాష్ట్రంలో 40 శాతం మంది ముస్లింలకు ఉద్యోగాలు ఉండేవి. ఇప్పుడు రెండు, మూడు శాతం మంది మాత్రమే ఉద్యోగాలు చేస్తున్నారు.

❖ తెలంగాణ రాష్ట్రం వల్ల స్వయం పాలన, ఆత్మగౌరవం ఒనగూరడమే కాకుండా విద్య, ఉద్యోగాల్లో స్థానికులకు అవకాశాలు పెరుగుతాయి.

❖ లోకసభలో, శాసనసభలో ఇచ్చిన, చేసిన కుదుర్చుకున్న హామీలు, ఒప్పందాలు, ఫార్ములాలు, ప్రణాళికలు ఏవీ గత 53 ఏళ్లలో అమలు కాలేదనేది మన అందరికి తెలుసు. తెలంగాణ వివక్షకు, వెనకబాటుకు, దోపిడీకి గత 53 ఏళ్లుగా గురవుతూనే ఉన్నది. దానికి ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారం.

- తెలంగాణ బలహీనవర్గాలు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు, మహిళల బాధలను వారియొక్క గొడును వినేవారు సమైక్య రాష్ట్రంలో లేకుండా పోయారు.
- తెలంగాణ ప్రజలు 50 ఏళ్లు సహనంతో నిరీక్షించారు. గత యాభై ఏళ్లుగా వివక్ష పెరిగిందే తప్ప తగ్గలేదు. భవిష్యత్తు తరాలవారు ఇదే విధంగా బాధపడే పరిస్థితి లేకుండా చూడాల్సిన బాధ్యత ఈ తరం తెలంగాణ ప్రజలపై ఉంది.

## ప్రస్తుత తెలంగాణ ఉద్యమం

- కాంగ్రెసు పార్టీకి చెందిన 41 మంది తెలంగాణ శాసనసభ్యులు 2000 సెప్టెంబర్‌లో పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీని కలవడానికి ముందు తమ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు డిమాండ్‌పై పిసిసి అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ రావును, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సి.ఎల్పీ) నాయకుడు వై.యస్. రాజశేఖరరెడ్డి ఒప్పించారు.
- 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం మలుపు తిరిగింది.

- ❖ తెలంగాణ రాష్ట్రం ఇస్తామని 2004లో కాంగ్రెసు పార్టీ హామీ ఇచ్చింది. యూపియే ప్రభుత్వం కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పింది. ప్రధాని ప్రసంగంలోనూ, రాష్ట్రపతి ప్రసంగంలోనూ హామీ ఇచ్చారు.

- ❖ యు.పి.ఎ. ప్రభుత్వం మాత్రమే తెలంగాణ ఇవ్వ గలుగుతుందని 2009 ఎన్నికల్లో కూడా కాంగ్రెసు హామీ ఇచ్చింది.

- ❖ 2009లో తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లో తెలంగాణ ఇస్తామని బి.జె.పి. పార్టీ హామి ఇచ్చింది. 1997లోనే బిజెపి తెలంగాణకి కట్టుబడి ఉంటామని కాకినాడ సమావేశంలో చెప్పింది.

- ❖ 610 జి.ఒ. అమలు చేసే ఉద్దేశ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖలో వున్న తెలంగాణేతరులను వారి వారి ప్రాంతలకు బదిలీ చేయనారంభించింది. కొద్ది మంది తెలంగాణేతరులు దీనిపై సుప్రీంకోర్టుకి వెళ్ళగా, హైదరాబాద్ ఫ్రీజోన్ అని సుప్రీంకోర్టు చెప్పింది.

- ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ ప్రకారం హైదరాబాద్ ఆరోజోన్‌లో భాగం కాని, ఫ్రీజోన్ అనేది ఎక్కడా లేదు. ఈ ఆర్డర్స్ ప్రకారం 70 శాతం ఉద్యోగాలు హైదరాబాద్ వారికే చెందాలి. ఫ్రీజోన్ సమస్య వల్ల తెలంగాణ ఉద్యోగుల్లో కలవరం ఏర్పడింది. ఉద్యోగ సంఘాలుకూడా ఉద్యమబాట పట్టాయి.

- తెలంగాణ రాష్ట్రం కోసం గత రెండు నెలలుగా ఉద్యోగులు, మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ఇంజినీర్లు, డాక్టర్లు, విద్యార్థులు, ఎన్నారైలు, మహిళలు, పిల్లలు ఉద్యమంలో చేతులు కలిపారు. ఎన్నో దశాబ్దాలుగా ఉద్యమాన్ని కవులు, కళాకారులు తమ ఆట, పాటలతో జీవింపచేశారు.

- ఉస్మానియా యూనివర్సిటీలో 12 విద్యార్థి సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)గా ఏర్పడి తెలంగాణ ఉద్యమములో ముందంజలో ఉన్నాయి.

- నవంబర్ 29వ తేదీన తెరాస అధ్యక్షుడు కె. చంద్రశేఖరరావు ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. దాంతో తెలంగాణ

ఉద్యమం ఊపందుకుంది. తెలంగాణలోని విశ్వ విద్యాలయాల విద్యార్థులు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. లక్షలాది మంది విద్యార్థులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, డాక్టర్లు, మేధావులు, మహిళలు, పిల్లలు కూడా తమకు జరిగిన అన్యాయానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే పరిష్కారమని వీధులకెక్కారు.

❖ తెలంగాణ సాధనలో దాదాపు 100 మంది తమ ప్రాణాలను త్యాగం చేసి వీర మరణంపొందారు. తెలంగాణలోని యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జీలు చేశారు.

❖ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతిస్తామని రాష్ట్రంలోని కాంగ్రెసు, బిజెపి. తెలుగుదేశం, ప్రజారాజ్యం, సీపిఐ పార్టీలతో సహా అన్ని రాష్ట్ర పార్టీలు ప్రకటించాయి.

❖ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు రాష్ట్ర శాసనసభలో తీర్మానం పెడితే బలపరుస్తామని 2009 డిసెంబర్ 7వ తేదీన అన్ని రాజకీయ పార్టీలు అఖిలపక్ష సమావేశంలో చెప్పాయి.

❖ తెలంగాణ ఏర్పాటు గురించి 2009 డిసెంబర్ 8వ తేదీన ప్రధాన రాజకీయ పార్టీలు పార్లమెంటులో తమ అనుకూలతను వ్యక్తం చేశాయి. పార్లమెంటులో బిల్లుపెడితే తాము మద్దతిస్తామని ప్రధాన ప్రతిపక్షం బిజెపి ప్రకటించింది.

❖ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9వ తేదీన రాత్రి 11.35 నిమిషాలకు ప్రకటించింది.

❖ రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్ర ఏర్పాటుకు రాష్ట్ర శాసనసభ తీర్మానం చేయాల్సిన అవసరం లేదు. బిల్లు ముసాయిదాను అభిప్రాయం కోసం మాత్రమే రాష్ట్ర శాసనసభకు పంపాల్సి ఉంటుంది. దానిపై శాసనసభలో ఓటింగ్ జరగదు. రాష్ట్ర శాసనసభ అభిప్రాయం తీసుకోవడం లాంఛనమే.

❖ సమైక్యాంధ్ర పేర రాయలసీమ, ఆంధ్ర ప్రాంత పెట్టుబడి దారులు తమ తమ ప్రాంతాల్లో కృత్రిమ ఆందోళనకు

శ్రీకారం చుట్టారు. పార్టీ విధానాలకు భిన్నంగా పార్టీలకు అతీతంగా ఆ ప్రాంతాల రాజకీయ నాయకులు ఒక్కటై తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి ప్రజలను రెచ్చగొట్టారు.

❖ దీంతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు విస్తృత చర్చ అవసరమని 2009 డిసెంబర్ 23వ తేదీన మరో ప్రకటన చేసింది. ఈ ప్రకటనతో తెలంగాణలో ఆందోళనలు మళ్ళీ ఉధృతమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియపై స్పష్టత, కాలపరిమితిని కోరుతూ పార్టీలకు అతీతంగా తెలంగాణలోని రాజకీయ నాయకులు, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు ఏకమై ఉద్యమాన్ని సాగించారు. విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలు చేశారు.

❖ 2009 డిసెంబర్ 30వ తేదీన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు జె.ఎ.సి. (జాయింట్ యాక్షన్ కమిటీ) పిలుపు మేరకు తెలంగాణలో శాంతియుతంగా సంపూర్ణ బంద్ జరిగింది.

❖ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రంలోని 8 రాజకీయ పార్టీలను తెలంగాణపై చర్చలకు ఆహ్వానిస్తూ 2009 డిసెంబర్ 30వ తేదీన ప్రకటన చేసింది. రాష్ట్రానికి చెందిన అఖిల పక్ష సమావేశం 2010 జనవరి 5వ తేదీన ఢిల్లీలో జరగనుంది.

## తెలంగాణ రాష్ట్రం - అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

### *తెలంగాణ రాష్ట్రం - ప్రగతి అవకాశాలు*

★ చిన్న రాష్ట్రాలు దేశాభివృద్ధిలో కీలక పాత్ర వహించడమే కాకుండా ప్రజా సమూహాలకు ప్రయోజనం చేకూరుస్తాయి. పంజాబ్, హర్యానా, కేరళ రాష్ట్రాల జి.డి.పి. దేశంలోని ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ఉండడమే అందుకు నిదర్శనం. కొత్తగా ఏర్పడిన చత్తీస్‌ఘడ్ ఉత్తారాంచల్ వంటి రాష్ట్రాలు కూడా అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తూ జి.డి.పి. పరంగా కూడా వృద్ధిని సాధించాయి.

★ అన్ని విధాలుగా తెలంగాణ ప్రజలు స్వయం పాలన సాగించుకుంటూ ఆత్మగౌరవంతో జీవించడానికి వీలవుతుంది. తెలంగాణ సహజ వనరుల దోపిడీ ఆగిపోయి ఈ ప్రాంతంలోనే వాటిని పూర్తిగా వినియోగించుకోవడానికి వీలు కలుగుతుంది.

★ తెలంగాణ కృష్ణా, గోదావరి జలాల్లోని తన న్యాయమైన వాటాను వాడుకుని అదనంగా 39 లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. దాని వల్ల వ్యవసాయ రంగంలో ఏడాదికి 7800 కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుంది. దాని వల్ల వ్యవసాయంలో దాని అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

★ బొగ్గు నిల్వల ద్వారా అదనపు థర్మల్ విద్యుదుత్పత్తిని చేపట్టి గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ కోత లేకుండా వ్యవసాయానికి, పరిశ్రమలకు వాడుకోవడానికి వీలు కలుగుతుంది.

★ అపారంగా ఉన్న సున్నంరాయి నిక్షేపాల వల్ల స్థానికులు సిమెంటు కర్మాగారాలు స్థాపించుకోవడానికి అవకాశం

చిక్కుతుంది. దట్టమైన అటవీ ప్రాంతాలు ఉండడం వల్ల అందుకు అనుబంధమైన పరిశ్రమలను స్థాపించుకునే వీలుంటుంది.

★ స్థానికులకు అదనంగా రెండు లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. దాని వల్ల అదనంగా 4800 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. దాంతో తెలంగాణ సమృద్ధిగా తులతూగుతుంది.

★ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి, సంబంధిత మేనేజిమెంట్, టెక్నికల్ రంగాల్లో ఎదగడానికి అవకాశాలు పెరుగుతాయి.

★ తెలంగాణ సంస్కృతిని ప్రోత్సహిస్తూ హస్తకళల యూనిట్లను స్థాపించి, కాటేజ్ పరిశ్రమలను అభివృద్ధి చేయవచ్చు.

★ రాష్ట్రంలోని మాదిగల్లో 70 శాతం మంది తెలంగాణలోనే ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సమస్య పరిష్కారమవుతుంది.

★ తెలంగాణలో 12 శాతం మంది గిరిజనులున్నారు. వారికి రిజర్వేషన్లు కల్పించి విద్యను, ఉపాధిని పెంచే అవకాశం లభిస్తుంది.

★ స్థానికులు కొత్త విద్యాసంస్థలను నెలకొల్పే అవకాశాలు లభించి, ప్రత్యేక కోర్సులను ప్రవేశ పెట్టడం ద్వారా స్థానిక విద్యార్థికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

★ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలను స్థాపించే అవకాశం చిక్కుతుంది.

★ వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు పెట్టడానికి అవకాశం దొరుకుతుంది.

★ రెండో తరగతి పట్టణాలను గుర్తించి వైవిధ్య, సమతుల్య అభివృద్ధి కోసం గ్రోత్ కారిడార్స్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఉదా : ఒక జిల్లాలో చేనేత జోన్, రెండో చోట ఐటి కారిడార్, మరో చోట లఘు పరిశ్రమలు, కాటేజ్ కేంద్రం, ఇట్లా...

★ విద్యుదుత్పత్తి పెరుగుతుంది కాబట్టి గ్రామీణ విద్యుదీకరణ సాకారమవుతుంది. రోడ్లు, భవంతులు, రైల్వే వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుంది.

★ మరిన్ని పరిశ్రమలను స్థాపించి ఉపాధి అవకాశాలు పెంచవచ్చు, స్థానిక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించవచ్చు.

★ లఘు, కాటేజీ పరిశ్రమలను గ్రామాల్లో, పట్టణాల్లో కూడా ప్రోత్సహించవచ్చు.

★ విశిష్టమైన పండుగలు, ఉత్సవాలు, జాతరల ద్వారా తెలంగాణ భాషను, సంస్కృతిని పరిరక్షించుకునే వెలుసుబాటు దక్కుతుంది.

★ మౌలిక వసతులైన రోడ్లు, రైల్వేలైన్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

★ అన్ని రంగాల్లో పేదలు, పీడితులు, మైనారిటీలు, మహిళలు తమ తమ వాటాలు పొందుతారు.

★ ఆరోగ్యరంగాన్ని మెరుగుపరచి మెరుగైన వైద్య సేవలను అందించడానికి వీలౌతుంది.

★ చారిత్రక ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవచ్చు. తద్వారా పర్యాటక, వినోద రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

★ ఆరోగ్యం, పారిశుధ్యం, ప్రజా వినియోగ సేవల మెరుగుకు ప్రాధాన్యం ఇవ్వడానికి వీలవుతుంది.

★ చివరగా తెలంగాణ రాష్ట్రం "ప్రజా కేంద్రీకృత అభివృద్ధి, ప్రజా ప్రయోజన పాలన, ప్రజా ప్రభుత్వానికి దారి తీస్తుంది".

**సేకరణ :** వివిధ పరిశోధనా పత్రాలు, వ్యాసాలు, ప్రభుత్వ నివేదికలు మరియు వరల్డ్‌వైడ్ వెబ్.

# Annexure I

## AVAILABILITY OF INFRASTRUCTURE IN HYDERABAD STATE BEFORE 1956

## (BEFORE MERGER OF HYDERABAD STATE WITH ANDHRA STATE)

1) **INDUSTRIES:** Singareni Colleries (Year 1871), First Spinning Mill (1873), Phirani Factory (1876), Govt. Printing Press (1876), Soda Factory (1910), Iron Factory (1910), Deccan Button Factory (1916), VST Factory (1919), Chemical Laboratory (1921), Deccan Glass Factory (1927), DBR Mills (1929), Azam Jahi Mills (1931), RTC (1932), Nizam Sugar Factory (1937), Sirpur Paper Mill (1939), Golconda Cigarette Factory (1941), Hyderabad State Bank (1942), Hyderabad Allwyn Metals (1942), Praga Tools (1943), Sirsilk (1946), Hyderabad Asbestos (1946), Hyderabad Lamination Products (1947).

2) **DEPARTMENTS:** Revenue (1864), Customs (1866), Formation of Districts (1866), Health (1866), Printing & Stationery (1867), Endowments (1867), Forest (1867), Municipal (1869), Public Works (1869), Education (1870), High Court (1870), Survey Settlement (1875), Land Settlement (1876), Population Census (1881), Excise (1882), Police (1883), Mines (1892), Industries and Commercial (1892), Local Fund (1893), Irrigation (1896), State Life Insurance Fund (1911), City Improvement Board (1912), Agriculture (1913), Hyderabad Civil Service (1913), Archaeology (1914), Akasha vani (Radio) (1932), Labour (1945).

3) **SCHOOLS, COLLEGES, & UNIVERSITIES :** Dar-ul Uloom School (1856), Chadarghat School (1872), Mufi-dul Anaam School (1879), Alia School (1879), Secunderabad Mahboob College (1884), Nizam College (1874), Nampally Girls School (1887), Warangal (Telugu) School (1890), Asafia School (1894), Medical College (1894), Viveka Vardhini School (1904), Mahboobia Girls School (Gunfoundry) (1910), City College (1920), Osmania University (1920), Osmania Medical College (1921), Hyderabad Public School (1923), Marwadi Hindi Vidyalaya (1924), Hindi Vidyalaya Secunderabad (1926), Physical Education College (1930), College of Veterinary Science (1946). Koti Womens College, Nampally Womens College.

4) **LIBRARIES:** Mudigonda Shankaradyula library, Secunderabad (1872), Asafia State Central Library (1892), Bharat Gunvardhak Library, Sha-ali-banda (1895), Bollaram Lirbary (1896), Sri Krishnadevaraya Library, Sultan-bazar (1901), Raja Raja Narendra Library, Hanamkonda (1904), Vignana Chandrika Library (1905), Pratapa Rudra Library, Warangal (1913), Samskruta Kala Vardhini, Secunderabad (1913), Bala Saraswati Library (1923), Jogipeta Library, Medak (1930)

5) **LAKES, BRIDGES, AND HISTORICAL BUILDINGS:** Hussainsagar Lake (1562), Puranapool (1578), Charminar, Gulzar House, Char Kaman (1589-91), Saroornagar Colony (1793), Sultan-shahi Mint (1803), Miralammandi (1805), Miralam Lake (1806), Bristish Residency Bhavan (1808),

Chandulal Baradari (1828), Chadarghat Bridge (1831), Afzal-gunj Bridge (1859-66), Post Offices (1862), Public Gardens (1873), Falaknuma Palace (1884), Chanchalguda Jail (1882), Muslim-Jang Bridge (1884), Hanuman Vyayamasala (1893), Raj Bhavan, High Court Building (1920), Osmansagar Gandipet (1920), Himayatsagar Anacut (1927),

6) **CEMENT ROADS :** Construction of cement Roads in Hyderabad 1930

7) **RAILWAY LINE** – Bombay to Raichur (1866), Mumbai – Secunderabad (1873), Nizam Railway Board (1874), Nampally Railway Station (1883),

8) **TELEPHONE NETWORK:** (1885), Nizamia Observatory Telescope (1890),

9) **DRAINAGE SYSTEM AND FLOOD CONTROL MECHANISM:** Underground Drainage System (1909), Sir Mokshagundam Visvesvaraya, Prepared a Scheme for Flood Protection work and **underground**

**drainage** for Hyderabad City.

*10)* **HOSPITALS** : Ayurveda, Unani Hospital (1890), Medical College (1894), Mental Hospital Erragadda (1897), Gigjikhana Victoria Memorial Nursing Home (1905), Homeopathy College (1916), Charminar Unani Ayurvedic Hospital (1927), Niloufer Hospital (1925), Osmania General Hospital (1945). Gandhi Hospital, TB Hospital, Cancer Hospital, ENT Hospital, Nizam Orthopaedic Hospital, Koranti Hospital, NIMS.

## Publications from Telagana Region before 1947 (Newspapers, Weeklies, and Monthlies)

| Year of Publication | Name of Publication | Published from |
|---|---|---|
| 1886 | Shedyachandrika | Hyderabad |
| 1890 | Dinavarthaman | Sultanbazar, Hyd |
| 1909 | Samyukta Sanghavarthamani | Madhira, Khammam |
| 1913 | Hithabodhini | Vanaparti |
| 1917 | Andhramata | Secunderabad. |
| 1920 | Mulaag Varthamani | Khammam |
| 1921 | Suvarathamani | Mahabubnagar |
| 1922 | Tenugu | Warangal |
| 1922 | Neelagiri | Nalgonda |
| 1923 | Shaiva Pracharini | Warangal |
| 1923 | Rayyath | Hyderabad |
| 1925 | Nedu | Secunderabad |
| 1925 | Bhagyanagar | Hyderabad |
| 1926 | Golkonda Pathrika | Hyderabad |
| 1927 | Adhi Hindu | Hyderabad |
| 1927 | Sujatha | Hyderabad |
| 1938 | Telugu Talli | Hyderabad |
| 1934 | Deccan Kesari | Hyderabad |
| 1936 | Vibhuti | Hyderabad |
| 1937 | Divya Vaani | Hyderabad |
| 1937 | Shobha | Warangal/ Hyd. |
| 1944 | Telangana | Hyderabad |
| 1947 | Imroj | Hyderabad |

# మాతృగీతం

రచన :
**అందెశ్రీ**

జయజయహే తెలంగాణ జననీ జయకేతనం
ముక్కోటి గొంతులకు ఒక్కటైన చేతనం ॥జయ...॥
తరతరాల చరితగల తల్లీ నీరాజనం ॥తర...॥
పది జిల్లాల నీ పిల్లల ప్రణమిల్లిన శుభతరణం
జై తెలంగాణ జై జై తెలంగాణ ॥ జై...॥

పోతనదీ పురిటిగడ్డ రుద్రమదీ వీరగడ్డ
గండర గండుడు కొమరం భీముడిలే బిడ్డ
కాకతీయ కళా ప్రభల కాంతిరేఖ రామప్ప
గోలుకొండ నవాబుల గొప్పవెలిగె చార్మినార్ ॥జయ...॥

జానపదా జనజీవన జానళీలు జాలువార
కవిగాయక వైతాళిక కళలా మంజీరాలు
జాతిని జాగృతపరిచే గీతాలా జనజాతర
అనునిత్యం నీ గానం అమ్మ నీవె మా ప్రాణం ॥జయ...॥

సిరివెలుగులు విరజిమ్మే సింగరేణి బంగారం
అణువణువుని ఖనిజాలే నీ తనువుకు సింగారం
సహజమైన వనసంపద సక్కనైన పూవులపొద
సిరులుపండె సారమున్న మాగాణియె కద నీ ఎద ॥జయ...॥

గోదావరి కృష్ణమ్మలు మన బీళ్ళకు మళ్ళాలి
పచ్చని మాగాణాల్లో పసిడి సిరులు పండాలి
సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి.
స్వరాష్ట్రమై తెలంగాణ స్వర్ణయుగం కావాలి ॥జయ...॥